క్లుప్తంగా

రూ.10 లక్షలతో సీసీ కాలువల నిర్మాణం



సీసీ కాలువ నిర్మిస్తున్న కార్మికులు

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామంలో సీసీ కాలువల నిర్మాణ పనులకు గ్రామపెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం శంకుస్థాపన చేశారు.'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.5 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5లక్షలతో కాలువలు నిర్మిస్తున్నట్లు సర్పంచ్ బీల రాజేశ్వరి తెలిపారు. సచివాలయ కన్వీనర్లు బీల సతీష్, బాజిరెడ్డి శంకరరావు, ఎస్.సుభద్రమ్మ, నాయకులు గోగాడ జగన్నాథంనాయుడు, బోను సింహాద్రినాయుడు, బూడి వెంకటరావు, నాగిరెడ్డి రాజినాయుడు, వెంకటరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సహాయం



బాధితులకు దుస్తులు అందజేస్తున్న అప్పలనాయుడు, రాము

దత్తిరాజేరు: మండలంలోని టి.భూర్జవలసలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో గవిడి గౌరినాయుడుకు చెందిన పూరిల్లు దగ్ధమై సర్వం కోల్పోయారు. బాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి ముడిదాపు రాము సహాయం అందజేశారు. ఆయన సమకూర్చిన దుప్పట్లు, దుస్తులతో పాటు టార్పాలిన్‌ను బాధితులకు వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు గురువారం అందజేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

1632 మద్యం బాటిల్స్ ధ్వంసం



మద్యం బాటిల్స్ ధ్వంసం చేస్తున్న పోలీసులు

చీపురుపల్లి: ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు 1632 మద్యం బాటిల్స్‌ను ధ్వంసం చేసినట్లు ఎస్సై ఎ.సన్యాశినాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మద్యం బాటిల్స్ ధ్వంసం చేశారు.

రెండు పశువుల వ్యాన్ల సీజ్



వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న పశువులు

దత్తిరాజేరు: అనుమతులు లేకుండా పశువులను అక్రమంగా తరలిస్తున్న రెండు బొలేరా వాహనాలను పెదమానాపురం పోలీస్ స్టేషన్ వద్ద గురువారం సాయంత్రం సీజ్ చేశామని ఎస్ఐ శిరీష తెలిపారు. పార్వతీపురం నుంచి వైజాగ్ రెండు బొలేరా వ్యాన్లలో 21 పశువులను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో వాహనాలను పట్టుకుని, కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

మోడల్ స్కూల్‌లో బోరు ఏర్పాటు



బోరు ఏర్పాటుకు డ్రిల్లింగ్ పనులు చేయిస్తున్న పద్మావతి

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని మరుపల్లి మోడల్ స్కూల్‌లో హ్యాండ్ బోరు డ్రిల్లింగ్ పనులను గ్రామానికి చెందిన రాష్ట్ర అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డి పద్మావతి గురువారం పూజలు చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, స మస్యను ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ఎంపీపీ స్పందిస్తూ మండల పరిషత్ నుంచి లక్ష రూపాయలు మంజూరు చేశారని తెలిపారు.

కులజనగణన సాహసోపేత నిర్ణయం



మాట్లాడుతున్న వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు

- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు

కొత్తవలస: కుల జనగణన చేసేందుకు శాసనసభలో తీర్మానం చేస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు అన్నారు. మండల కేంద్రంలోని తన క్యాంపు ఆఫీస్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో ఎప్పుడో 1930వ సంవత్సరంలో కుల జనగణన జరిగిందని, మళ్లీ ఇన్నాళ్లకు మన రాష్ట్రంలో కుల జనగణనకు శాసనసభ తీర్మానించడం శుభపరిణామం అని అన్నారు. ఈ గణన వల్ల ప్రతి కులానికీ ప్రయోజనం చేకూరే అవకాశం ఉందన్నారు. ఈ జనగణన కోసం ప్రభుత్వం ఆరుగురు ఐఏఎస్ అధికారులతో కూడిన కమిటీ ఏర్పాటు చేసిందని తెలిపారు. కుల జనగణనతో ప్రధానంగా బీసీలకు రాజకీయంగా, సామాజికంగా,ఆర్థికంగా ఎక్కువ శాతం ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. గులివిందాడ సర్పంచ్ జామి ఈశ్వరరావు, నాయకులు ఆతవ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పారిశుద్ధ్య పనులు



గుర్ల: చెత్తను ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న కార్మికులు



గజపతినగరం: పురిటిపెంటలోని వీధి కాలువలో పూడికను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

గుర్ల: మండలంలోని గూడెం గ్రామంలో సర్పంచ్ ఎజ్జిపరుపు లక్ష్మణరావు పర్యవేక్షణలో గురువారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. గ్రామంలోని అన్ని వీధి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించి, ట్రాక్టర్‌తో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించారు. దోమల నివారణకు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తెలిపారు.

పురిటిపెంటలో..

గజపతినగరం: స్థానిక పురిటిపెంట న్యూకాలనీలో పంచాయతీ ఈఓ జనార్దనరావు గురువారం పారిశుద్ధ్య పనులు చేయించా రు. కాలనీలోని వీధి కాలువల్లో పూడికతో పాటు బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నామని ఈఓ తెలిపారు.

ముద్దూరులో 'ఆరోగ్య సురక్ష' శిబిరం రేపు

బొండపల్లి: 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా ఈనెల 30వ తేదీన మండలంలోని ముద్దూరు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, ఎంపీపీ చల్లా చలంనాయుడు గురువారం తెలిపారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులతో పాటు,వైద్య సిబ్బంది, మండల ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. ఉదయం 10:30 గంటలకు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు బొద్దాంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

వేపాడ: బొద్దాం గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండ ల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ముమ్మలూరి జగ్గుబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వ ర్యంలో ఈకార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బియ్యం వేలం రేపు

బొండపల్లి: అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు సీజ్ చేసిన పీడీఎస్ బియ్యంను ఈనెల 30వ తేదీన బొండపల్లి మండలం బోడ సింగిపేటలోని ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద వేలం వేయనున్నట్లు గజపతినగరం సీఎస్‌డీటీ డి.వి.రవి శంకర్ తెలిపారు. గజపతినగ రంతో పాటు, గంట్యాడ, ఎస్.కోట, కొత్తవలస మండలాల్లో పలు కేసుల్లో 182.42 క్వింటాళ్ల బియ్యం పట్టుబడినట్లు పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు ఆరోజు ఉదయం 11 గంటలకు ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద హాజరు కావాలని సూచించారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా కమిటీలు



సమావేశమైన బీజేపీ నాయకులు

గజపతినగరం: నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) బలోపేతమే లక్ష్యంగా కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవర ఈశ్వరరావు తెలిపారు. నియోజకవర్గస్థాయి ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బూత్ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. కష్టపడి పని చేసే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. నాయకులు మండపాక భారతి, ఎస్.దుర్గాప్రసాద్, ఎస్సీ మోర్చా నాయకుడు పి.గౌరి, నాలుగు మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌కు సత్కారం



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును సన్మానిస్తున్న భోగాపురం మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు

భోగాపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందజేయడంతో పాటు జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, తదితరులు గురువారం ఘనంగా సత్కరించారు. జెడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా శ్రీనివాసరావును సత్కరించినట్లు సూర్యనారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దంతులూరి రావాడబాబు, మైలపిల్లి నరసింహులు, పూడిక నూకరాజు, కర్రోతు వెంకటరమణ, బైరెడ్డి రమణ, పడాల శ్రీనివాసరావు, సుందరహరీష్, వాసుపల్లి రేయ్యుడు, పతివాడ రామకృష్ణ, పోతిరెండి గోపి, డీబీ రెడ్డి, కొయ్య బంగార్రాజు, శీరపు గురునాథ్‌రెడ్డి, పిగుడు రాంబాబు, ఊడికల గురువులు, రాయి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మం ప్రపంచానికే ఆదర్శం



ఆధ్యాత్మికవేత్త ఇందుమణిని సత్కరిస్తున్న యోగా శిక్షకులు సుజాత, మహిళలు

చీపురుపల్లి: సనాతన హిందూ ధర్మాన్ని ఆచరించడంతో పాటు అమలు చేయడంతో ప్రతి ఒక్కరూ ముందుండాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఆరిశెట్టి ఇందుమణి అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని చైతన్య యోగా సంస్థను సందర్శించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సత్సంగంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సనాతన హిందూ ధర్మాన్ని పాటించాలని సూచించారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. రోజూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. అనంతరం చైతన్య యోగా సంస్థ వ్యవస్థాపకురాలు గవిడి సుజాత ఆధ్వర్యంలో యోగా శిక్షకులు ఆమెను ఘనంగా సత్కరించారు.

పెదవేమలిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామంలో వైద్యసిబ్బంది గురువారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే నిర్వహించారు. వైద్య సిబ్బంది, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి 10 ఏళ్లు దాటిన వారికి హెచ్‌బీ పరీక్షలు, 30 ఏళ్లు దాటిన వారికి బీపీ, సుగర్, తదితర వైద్యపరీక్షలు చేశారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి టోకెన్‌లు అందజేసి, త్వరలో నిర్వహించనున్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి హాజరు కావాలని సూచించారు.



వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న ఏఎన్‌ఎం పార్వతి

స్కేట్ నైపుణ్య ప్రదర్శనకు పయనం



కొత్తవలస రైల్వే స్టేషన్ వద్ద గుంటూరు వెళుతున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

వేపాడ: గుంటూరు జిల్లాలో శుక్రవారం నుంచి అక్టోబర్ 2వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్కేట్ నైపుణ్య ప్రదర్శనకు వేపాడ మండలంలోని సోంపురం, కొత్తవలస మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలకు చెందిన 13 మంది విద్యార్థులు జిల్లా తరఫున ఎంపికయ్యారు. సోంపురం హెచ్‌ఎం బి.పి.ఎ.రాజు మాట్లాడుతూ జిల్లా నుంచి 22 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కేట్ నైపుణ్య ప్రదర్శనలో పాల్గొననున్నారని చెప్పారు. సోంపురం, కొత్తవలస పాఠశాలల విద్యార్థులు కొత్తవలస నుంచి రైలులో గుంటూరుకు గురువారం బయలుదేరారని తెలిపారు.

అన్న సమారాధన



దత్తిరాజేరు: కోమటిపల్లిలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



వేపాడ: వేపాడ బీసీ కాలనీలో అన్నప్రసాదం వడ్డిస్తున్న యువకులు

దత్తిరాజేరు/వేపాడ: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దత్తిరాజేరు మండలంలోని కోమటిపల్లి, వేపాడ మండలంలోని బీసీ కాలనీలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గురువారం అన్నదానం నిర్వహించారు. ఆయా గ్రామస్తులతో పాటు చుట్టు పక్క గ్రామాల నుంచి వచ్చిన వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు.

సత్తా చాటిన గురుకుల విద్యార్థినులు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్, ఉపాధ్యాయ సిబ్బంది

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో సత్తా చాటారు. కొత్తవలసలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ క్రీడల్లో ఈ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ గురువారం తెలిపారు. అండర్-14 విభాగం 100 మీటర్లలో విద్యార్థిని రేష్మ ప్రథమ స్థానం, 200, 400 మీటర్లలో సుజాత ప్రథమస్థానం సాధించారు. డిస్క్ త్రోలో సీహెచ్. కృష్ణవేణి ప్రథమ, షార్ట్‌పుట్‌లో నీలిమ తృతీయ, ఖోఖోలో బి.రాధిక, సుజాత ప్రథమ స్థానాల్లో నిలిచారు. అండర్-17 విభాగం డిస్క్ త్రోలో వై.జానకి ప్రథమ, షార్ట్‌పుట్‌లో ద్వితీయ, డిస్క్ త్రోలో డి.శిరీష ద్వితీయ, ఆడుల్స్‌లో ప్రథమ, జావెలిన్‌త్రోలో ఆర్.నీహారిక ప్రథమ, ఆడుల్స్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. 400 మీటర్ల పరుగులో బి.స్వాతిక, 100 మీటర్ల పరుగులో జె.హారిత తృతీయస్థానం సాధించారు. కబడ్డీలో రూప, ప్రణీత జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తి ఆదర్శం



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న హెచ్‌ఎం గోపి, రెడ్డి రమణ

చీపురుపల్లి: స్వాతంత్య్ర సమర యోధుడు భగత్ సింగ్ పోరాట స్ఫూర్తిని యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక రామాంజనేయకాలనీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కంది గోపి అన్నారు. ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతిని ఆ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడు తూ 1907లో పంజాబ్‌లో జన్మించిన భగత్‌సింగ్ స్వాతంత్య్ర పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారని చెప్పారు. జలియన్‌వాలాబాగ్ దుర్ఘటనతో ఆయన చలించిపోయారన్నారు. స్వాతంత్య్రం కోసం చిన్న వయస్సులోనే ప్రాణాలు ఇచ్చిన గొప్పవ్యక్తి భగత్ సింగ్ అని విద్యార్థులకు వివరించారు.

రాయితీపై గడ్డి కత్తిరింపు యంత్రం అందజేత

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు పంచాయతీ శివారు రొంగళివానిపాలెం గ్రామానికి చెందిన పాడిరైతు మాచవరపు ప్రసాద్‌కు రాయితీపై గడ్డి కత్తిరింపు యంత్రాన్ని ఎల్.కోట పశువైద్యాధికారి కె.గాయత్రి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈయంత్రం వల్ల పచ్చగడ్డిని పూర్తిస్థాయిలో పశువులకు మేతగా అందించవ చ్చని చెప్పారు. ముదురుగడ్డిని కత్తిరించి పాడిపశువులకు మేతగా వేయడం వల్ల పాలల్లో కొవ్వుశాతం పెరుగుతుందన్నారు. యంత్రాలు కావాల్సిన రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చందులూరు పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.



పాడిరైతుకు గడ్డి కత్తిరింపు యంత్రాన్ని అందజేస్తున్న పశువైద్యాధికారి గాయత్రి

పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయమే మేలు



లక్కవరపుకోట: మార్లపల్లిలో రైతులతో కషాయాలు తయారు చేయిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తవలస/లక్కవరపుకోట: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయమే అన్ని విధాలా మేలని, రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సబల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఈశ్వరరావు సూచించారు. వరి పంటను ఆశించే తెగుళ్ల నివారణకు అవసరమైన కషాయాల తయారీపై ఆ సంస్థ ఆధ్వర్యంలో కొత్తవలస మండలం గొల్లలపాలెం, ఎల్.కోట మండలం మార్లపల్లి గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. తూటికాడ, వావిలాకు, జిల్లేడు తదితర కషాయాలను రైతులతో తయారు చేయించారు. తెగుళ్ల నివారణకు రసాయన పురుగు మందులు,ఎరువులను ఉపయోగించవద్దని ప్రకృతిలో లభ్యమయ్యే వివిధ రకాల పత్రాలతో తయారు చేసిన కషాయాలను వినియోగించాలని కోరారు. ఈ విధానం వల్ల పెట్టుబడి ఆదా అవుతుందని, పర్యావరణానికి హాని కలగదని చెప్పారు. అలాగే భూసారం దెబ్బ తినకుండా కాపాడవచ్చని వివరించారు. సీఆర్పీలు భవాని, జానకి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస: గొల్లలపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న సబల సంస్థ ప్రతినిధులు

అవగాహన ఒప్పందం

విజయనగరం అర్బన్: సీఎస్‌సీ అకాడమీ ఆఫ్ మెయిట్ (మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) భారత ప్రభుత్వ సంస్థతో సీతం ఇంజినీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం చేసుకుందని సీతం విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు అన్నారు. ఈ మేరకు గురువారం కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఒప్పందంపై సీఎస్‌సీ అకాడమీ ప్రతినిధులు సంతకం చేశారు. ఈ సందర్భంగా శశిభూషణరావు మాట్లాడుతూ, ఒప్పందంలో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో సీఎస్‌సీ అకాడమీ ప్రతినిధి వీఎల్‌ఈవై రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీడీవీఏ నాయుడు, సీఎస్‌సీ అకాడమీ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ పి.సౌజన్య పాల్గొన్నారు.



ఒప్పంద పత్రంతో అకాడమీ, కళాశాల ప్రతినిధులు